ఎపి వీక్లీ
apweekly.com
ప్రవాసాంధ్ర 11/20/2006

# నిరుపేదలకు టాన్‌టెక్స్-తానా సహాయం

(నెట్‌డెస్క్)




'ఆర్లింగ్టన్ లైఫ్ షెల్టర్', 'ఇర్వింగ్ కేర్స్' సంస్థలకు ఆహారపదార్థాలు, నిత్యావసరాలు అందజేస్తున్న మూర్తి ములుకుట్ల, శ్యామల రుమాళ్ళ, తోటకూర ప్రసాద్‌లు.

తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) డల్లాస్‌శాఖ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టాన్‌టెక్స్)లు సంయుక్తంగా 'మెయిన్‌స్ట్రీం కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్' క్రింద ఇటీవల సాంఘిక సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి అందరి అభినందనలు అందుకున్నాయని తోటకూర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

సిరియల్ డబ్బాలు, డబ్బాల్లో భద్రపరిచిన పళ్ళు, పళ్ళ రసాలు, పేపర్ టవల్స్,

పెద్ద పెద్ద ట్రాష్ బ్యాగ్‌లు వంటి ఎన్నింటినో పెద్దమొత్తంలో ఇక్కడి లాభాపేక్ష లేని సేవాసంస్థలైన 'ఆర్లింగ్టన్ లైఫ్ షెల్టర్', 'ఇర్వింగ్ కేర్స్'లకు ఈనెల 16న అందజేశారు. స్థానిక సమూహాలకి సహాయం చేయడం, ఆదుకోవడం అన్నది పౌరులుగా మన నైతిక బాధ్యత, సమాజం నుంచి మనం నిత్యం ఎంతో పొందుతున్నాం, ఈ మాత్రం చేయడం మన కనీస ధర్మం. ఈ దేశంలో ఇంకా మనం చేయగలిగింది ఎంతో వుంది. స్థానిక సమూహాలకి సహాయం చేయడంలో 'తానా' ఎప్పుడూ ముందుంటోంది అని 'టాన్‌టెక్స్' కోశాధికారి తోటకూర ప్రసాద్ ఈ సందర్భంగా అన్నారు. ఏటా తాము చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా బడి పిల్లలకు బ్యాక్‌పాక్‌లు పంచడం, అన్నార్తులకు భోజనాలు ఏర్పాటు చేయడం వంటివి కూడా నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

'ఆర్లింగ్టన్ లైఫ్ షెల్టర్' ఇళ్ళులేని 100 మందికి ఆశ్రయం కల్పిస్తోంది. వారంతా పగలు చిన్నచిన్న పనులు చేసుకుంటూ రాత్రిళ్ళు ఇక్కడ తలదాచుకుంటారు. అలాటి వారికి అత్యవసరమైన ఈ వస్తువులు అందజేసిన 'తానా', 'టాన్‌టెక్స్' సంస్థల సేవాభావాన్ని మేం అభినందిస్తున్నాం అని 'ఆర్లింగ్టన్' సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బెకీ ఓర్లాండర్ అన్నారు. ఇప్పుడు ఈ రెండు సంస్థలూ విరాళంగా ఇచ్చిన ఈ సామగ్రి దాదాపు నెల రోజులపాటు ఇక్కడివారి అవసరాలను తీరుస్తుందని ఆయన చెప్పారు.

తిండికూడా గడవని దురదృష్టవంతులు కొంతమంది రోజూ ఆహారపదార్థాలకోసం ఇక్కడికి వస్తుంటారు, డబ్బాల్లో భద్రపరిచిన పళ్ళూ, ఫలరసాలు అన్నవి అసలు వారి ఊహల్లోకి కూడారావు. ఇలాటి ఖరీదైన వస్తువులు అందరూ దానం చేయరు. వీటిని స్వీకరించినవారు మీ దాతృత్వాన్ని, మిమ్మల్ని, మీ సంస్థలని తప్పక గుర్తుంటుకుంటారు, ఆశీర్వదిస్తారు అని 'ఇర్వింగ్' మేనేజర్ లీగ్ అభినందనపూర్వకంగా చెప్పారు.

“ఇలాంటివారిని ఆదుకునేందుకు కార్యక్రమాలు నిర్వహించగలగడం మాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ఈ దేశంలో కూడా ప్రజల సహాయం కోసం ఇంతమంది ఎదురుచూడడం, ఆధారపడడం ఆశ్చర్యం కలిగిస్తోంది. టాన్‌టెక్స్ తరఫున ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేసిన మా ఉపాధ్యక్షులు శ్యామల్ రుమాళ్ళను అభినందిస్తున్నాను. ఉమా యలమంచి, కస్తూరి ఇనగంటి, కిరణ్ కంచర్ల, మనోహర్‌రెడ్డి, నకట వెంకట రాజు, సోమ్స్, ఉషా ములుకుట్ల, కృష్ణ, వల్లి ములుకుట్ల, క్రిష్ణ ఆకెళ్ళ, పటేల్ వంటివారు విరివిగా ఇచ్చిన విరాళాలు, తానా సహాయం లేకపోతే ఈ కార్యక్రమం నిర్వహించగలిగేవారం కాదు. అందుకు వారినందరినీ అభినందిస్తున్నాను” అని టాన్‌టెక్స్ అధ్యక్షుడు మూర్తి ములుకుట్ల అన్నారు.